# చివరికి మిగిలింది!

అది ఏప్రిల్ 30, 1945. బెర్లిన్‌లో జర్మన్ ఆర్మీకీ సోవియట్ ఆర్మీకీ భయంకరమైన యుద్ధం జరుగుతున్నది. వేలకి వేల జనం చచ్చిపోతున్నారు. బిల్డింగులూ బ్రిడ్జీలు నేలమట్టం అవుతున్నాయి. కానీ ముప్ఫై అడుగుల దూరంలో బంకర్లో వున్నాడు హిట్లర్. ఆ బంకర్ పేరు వూల్ఫ్స్ షాన్జ్. అంటే తోడేలు అబద్దాలు అని అర్థం. బయట ఎంత రణగొణ ధ్వని అవుతున్నా అక్కడ మాత్రం నిశ్శబ్దంగా వుంది. కారణం ఇంకొక వారం రోజుల్లో జర్మనీ లొంగిపోతుంది. అంటే రెండవ ప్రపంచ యుద్ధం ముగుస్తుంది. అప్పుడే వచ్చింది వార్త. హిట్లర్ బాడీ గార్డూ, స్టాఫ్ సార్జెంటూ అయిన రోకస్ మిష్ అది విని అదిరిపడ్డాడు. అప్పటికే అంతా అయిపోయింది!

అప్పుడు మిష్ వయసు 27 సంవత్సరాలు. రక్తం వురకలు వేసే వయసు. 1940లో హిట్లర్ కావాలని మిష్‌ని తన బాడీగార్డ్లలో ఒకడిగా ఎంచుకున్నాడు. హిట్లర్‌ని అంటిపెట్టుకుని అతన్ని కాపాడటమే ధ్యేయంగా పెట్టుకున్నాడు మిష్. చివరికి సోవియట్ ఆర్మీ చుట్టుముట్టుతున్నప్పుడు, అతన్ని బంకర్‌లోకి చేర్చి బయట రహస్యంగా కాపలా కాస్తున్నది కూడా మిష్షే. హిట్లర్ని బాస్ అని పిలిచేవాడుట.

ఇప్పుడు మిష్ వయస్సు 87 దాటింది. చరిత్రలో అందరూ హిట్లర్ని అసహ్యించుకుంటున్నా, అతనికి హిట్లర్ ఈనాటికీ బాసే. హిట్లర్ ఎంతో మంచి బాస్ అని కూడా అంటాడితను. అప్పుడు జరిగిన విషయాలన్నీ గుర్తుకి తెచ్చుకుని మరీ చెబుతుంటాడు.

ఆనాటి సోవియట్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ ఏప్రిల్ 16న జర్మనీ మీద విరుచుకుపడ్డాడు. 270 లక్షలమంది సోవియట్లని చంపిన నాజీ జర్మనీని రూపుమాపటమే లక్ష్యం. 25 లక్షల జవాన్లతో, 6 వేల టాంకులతో పెద్ద ఎత్తున వచ్చాడు. బెర్లిన్‌లో వుంది మూడు లక్షల జర్మన్ సైనికులు మాత్రమే. ఇద్దరి మధ్యా యుద్ధం పెద్ద ఎత్తున జరిగింది. మూడున్నర లక్షల రెడ్ ఆర్మీ సైనికులు దెబ్బతిన్నారు. వారిలో 78 వేలమంది చనిపోయారు. లక్షమంది జర్మన్లు చనిపోయారు. అంతా గందరగోళం అయిపోవటంతో ఎంతమంది చనిపోయారో ఎంతమంది పక్కదేశాలకి పారిపోయారో ఎంతమంది లొంగిపోయారో తెలియలేదు. ఆ ఆరు రోజుల యుద్ధంలో జర్మనీకి కోరలు పీకేశారు. మిష్ ఆ రోజు జరిగినది గుర్తు చేసుకుంటూ, 'హిట్లర్ రెండే మాటలు అన్నాడు. యుద్ధంలో ఓడిపోయాం. అంతా అయిపోయింది అని' అన్నాడు.

బయట అంత యుద్ధం జరుగుతున్నా ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుని పోరాడుతున్నా, ఆ బంకర్‌లో ఏప్రిల్ 28న జరిగిందేమిటో తెలుసా? హిట్లర్‌కీ, అతని ప్రియురాలు ఈవా బ్రౌన్‌కీ వివాహం నిశ్చయించినారు కావున, వారికి ఎంతో ముఖ్యులైన సమాచార మంత్రిగారు జోసెఫ్ గేబుల్స్, నమ్మకస్తుడు మార్టిన్ బోర్మన్, వారి పెళ్ళి జరిపించే మాజిస్ట్రేట్‌లు విచ్చేసి అక్షింతలు వేశారు. మిష్ బయట, యధా ప్రకారం, కాపలా వున్నాడు. పెళ్ళయ్యాక శోభనం, హనీమూన్ లేకపోగా ఏప్రిల్ 30వ

తారీఖున జరగరానిదే జరిగిపోయింది.

ఆరోజు సంఘటన తలుచుకుంటూ మిష్ అంటాడు. 'నాకేమీ గన్ షాట్లు వినపడలేదు. అక్కడ వున్నతను నెమ్మదిగా చెప్పాడు అంతా అయిపోయిందని. నేను గబగబా వెళ్ళి బంకర్‌లో చూశాను. హిట్లర్ టేబుల్ మీద ఒరిగి పడిపోయి వున్నాడు. నుదుటి మీద నించీ బుగ్గల మీదుగా రక్తం కారిపోతున్నది. తనని తనే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హిట్లర్ పక్కనే అతని మీద, తన తల వాల్చిన నూతన వధువు. ఈవా బ్రౌన్ సయనైడ్ తిని సతీ సహగమనం చేసింది. అలా వాళ్ళని చూడగానే నాకు గాబరా వేసింది. పరుగెత్తుకుంటూ వచ్చి, చెప్పవలసిన వాళ్ళకి చెప్పి, మళ్ళీ వెనక్కి వచ్చాను. అప్పటికే హిట్లర్, ఈవా శవాల్ని దుప్పటిలో చుట్టేశారు. నా కళ్ళెదురుగానే పెట్రోల్ పోసి అంటించారు. అక్కడే వున్న ఇంకొక గార్డు అరుస్తు న్నాడు బాస్‌ని తగలబెట్టేస్తున్నారు అని. అలా ముగిసింది ఒక నియంత జీవితం' అన్నాడు మిష్, అరవై ఏళ్ళ తర్వాత ఆనాటి సంఘటనలు వ్రాస్తూ.

హిట్లర్ ఆత్మహత్య చేసుకున్న వెంటనే జర్మనీ, జనరల్ ఐసెన్‌హోవర్‌కి లొంగిపోయింది. సోవియట్, అమెరికన్, బ్రిటిష్ ఆర్మీలు జర్మనీని ఆక్రమించు కున్నాయి. కమ్యూనిష్టు సోవియట్లు ఆక్రమించినది తర్వాత కమ్యూనిష్టు తూర్పు జర్మనీ అయితే, రెండవది ప్రజాస్వామ్య పడమటి జర్మనీ అయింది.

హిట్లర్ ఆత్మహత్య చేసుకున్న మర్నాడే మిష్ పారిపోయాడు. అయినా సోవియట్లు అతన్ని గాలించి వెంటనే పట్టుకున్నారు. తొమ్మిదేళ్ళు మాస్కో జైల్లో పెట్టి, హింసించి, హిట్లర్ చివరి రోజుల గురించి తెలుసుకున్నారు. 1954లో జైలునించీ విడుదలయి బెర్లిన్ చేరుకున్నాడు. అక్కడే పెళ్ళి చేసుకుని, ఒక చిన్న షాపు పెట్టుకుని స్థిరపడిపోయాడు. హిట్లర్ అంటే అతనికింకా గౌరవమే. 60 లక్షల మంది జ్యూలని చంపిన హోలోకాస్ట్ గురించి నిజంగా తనకేమీ తెలియదంటాడు ఇప్పటికీ!

బేచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పరీక్ష తప్పి, ఒకటో ప్రపంచయుద్ధంలో చేరాడు హిట్లర్. ప్రపంచాన్ని తన చేతిలో పెట్టుకోవాలని అర్రులు చాచాడు. అహంభావం, అత్యాశ వెర్రితలలు వేసి నియంతగా మారాడు. రెండవ ప్రపంచ యుద్ధానికి కారకు డయ్యాడు. హోలోకాస్ట్ ద్వారా కొన్ని కోట్లమంది జ్యూయిష్ వారిని నరికిపారేశాడు. 56 ఏళ్ళకే తన జీవితాన్ని అంతం చేసుకున్నాడు. కానీ చివరికి మిగిలిందేమిటి? బూడిద కూడా మిగలలేదు. అతని శరీరం పూర్తిగా తగలబడకముందే, సోవియట్లు దవడ ఎముకలు, పుర్రెలాటి కొన్ని శరీర భాగాల్ని తీసుకుపోయి వారి ఫెడరల్ ఆర్ఖైవ్స్‌లో పెట్టుకున్నారు. అతని మిగిలిన శరీరాన్ని ఎక్కడ పారేశారో తెలుసా? మురికి కాలువలో!

నియంతలకీ, యుద్ధకాంక్షతో కుళ్ళిపోతున్నవారికీ చివరికి మిగిలేది అదేనేమో!

0 0 0

(ఈ వ్యాసానికి ఆధారం నేను చదివిన - మిష్‌తో జరిగిన ఇంటర్వ్యూలు, రెండవ ప్రపంచ యుద్ధం మీద కొన్ని పుస్తకాలు)